## క్లుప్తంగా

### ఉప కారాగారం తనిఖీ


ఖైదీలకు పెడుతున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న రత్నప్రసాద్

నరసాపురం: ఉప కారాగారాన్ని శుక్రవారం ఉమ్మడి పశ్చిమజిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తనిఖీ చేశారు. జైలు అదాలత్ నిర్వహించి, వంటశాలను పరిశీలించారు. ఖైదీలకు అందించే ఆహారం నిబంధనలకు లోబడి అందించాలని ఆదేశించారు. ఖైదీలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేనివారు కోర్టు జైలు విజిటింగ్ లాయర్‌ను సంప్రదిస్తే ఉచిత న్యాయవాదిని నియమిస్తారని చెప్పారు. జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. ఆయనవెంట సబ్‌జైలు సూపరింటెంట్ టి.అప్పారావు ఉన్నారు.

### సామూహిక కుంకుమ పూజలు


సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని రామయ్య హాలు ప్రాంతంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సభ్యుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యురాలు టి సునీత, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

మొగల్తూరు: శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో మండలంలోని పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొగల్తూరు భవానీ కాలనీలో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించి, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో సామూహిక పూజలు నిర్వహించారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ, పేరుపాలెం, కాళీపట్నం, కేపీపాలెం, రామన్నపాలెం, జగన్నాథపురంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### మానసిక దివ్యాంగుల పాఠశాలకు వితరణ


మానసిక దివ్యాంగుల పాఠశాల నిర్వహణకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మానసిక దివ్యాంగులు దైవంతో సమానమని, అటువంటి వారికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్లేనని సర్వశిక్ష అభియాన్ సిస్టమ్ ఎనాలసిస్ట్ షేక్ బాబాజీ అన్నారు. పాలకొల్లు సబ్బేవారిపేటలో గల అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలోని దివ్యాంగులకు శుక్రవారం భోజన వితరణ చేసి, ఆర్థిక సహాయం చేశారు. అష్రాఫ్, హనీఫ్, తోకల జనార్థన్, అంజలి పాఠశాల ప్రిన్సిపాల్ వీడీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

### గోదావరి పెరగడంతో కాజ్‌వే మునక


కనకాయలంకలో మళ్లీ నీట మునిగిన కాజ్ వే ప్రాంతం

యలమంచిలి: గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండుటతో గోదావరిలో నీటి మట్టం పెరిగింది. దీంతో కనకాయలంకలో కాజ్ వే ప్రాంతం మొత్తం మళ్లీ నీట మునిగింది. దీంతో అధికారులు పడవలు ఏర్పాటు చేశారు. గడచిన మూడు వారాలుగా కనకాయలంకను వరద వీడకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# చెన్నుపాటి ఆశయాలకనుగుణంగా యూటీఎఫ్

నేడు యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

యలమంచిలి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవం శనివారం నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భవించింది. అప్పటికీ రాష్ట్రంలో ప్రాంతాల వారీగా, యాజమాన్యాల వారీగా, కేడర్ల వారీగా ఉపాధ్యాయ సంఘాలు ఉండేవి. వాటన్నింటినీ సమైక్యపరచి ఒక చారిత్రక అవసరంగా ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడిగా చెప్పుకునే చెన్నుపాటి ఆశయాలకు అనుగుణంగా యూటీఎఫ్‌ను ఏర్పాటు చేశారు. ఈ 50 ఏళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా యూటీఫ్ రూపుదిద్దుకుంది. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా పని చేస్తున్న యూటీఎఫ్ ఈ 50 ఏళ్లలో సాధించిన విజయాలను ఒకసారి పరికిస్తే..

**సాధించిన విజయాలు**

1975లో వచ్చిన మూడవ పీఆర్సీలో ఎన్జీఓలతో సమానంగా ఉపాధ్యాయుల వేతనాలు సాధించడం మొదటి విజయం. 1979 ఎన్జీఓల కంటే అదనంగా ఒక స్టేజీ వేతనాలు సాధించారు. 1982లో రీ గ్రూపింగ్ స్కేల్స్ ద్వారా పదోన్నతి రాకపోయినా సర్వీసును బట్టి పదోన్నతి స్కేలు వచ్చేలా (అప్రయత్న పదోన్నతి పథకం సాధన) కృషి చేసింది. భాషా పండితులకు గ్రేడ్ వన్ స్కేల్, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు నేరుగా వేతనాలు, 1998లో ఉపాధ్యాయుల బదిలీల్లో కౌన్సిలింగ్ విధానం, అప్రెంటీస్ విధానం రద్దు చేయించి, రెండు నోషనల్ ఇంక్రిమెంట్ల సాధన, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు సాధించడం యూటీఎఫ్ ఘనత.



మేడపాడులో నూతనంగా నిర్మించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ స్థూపం



యూటీఎఫ్ స్వర్ణోత్సవ లోగో

**యలమంచిలి మండల శాఖ ఘనత..**

యూటీఫ్ సంఘ స్థాపనలో మూల పురుషులుగా భావించే ఎస్ఆర్ పోలిశెట్టి, సీనియర్ ఉద్యమ నేతలైన వలవల శ్రీరామమూర్తి, పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే, సరిపల్లి జయప్రభ యలమంచిలి మండలంలో పని చేసిన వారే. వీరిలో పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే 1997లో యూటీఎఫ్ టాలెంట్ టెస్టులకు రూప కల్పన చేశారు. ఐదు, ఏడు, పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహించి, పరీక్షలంటే విద్యార్థుల్లో ఉండే భయాందోళలను పారద్రోలడానికి కృషి చేశారు. నేడు రాష్ట్ర స్థాయిలో ఈ టెస్టులు నిర్వహించడం గమనార్హం.

**డిసెంబర్‌లో రాష్ట్ర స్థాయి మహా సభలు**

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు ఈ ఏడాది డిసెంబర్ 14నుంచి 17వరకూ కాకినాడలో నిర్వహించడానికి సంఘ నాయకులు కృషి చేస్తున్నారు. స్వర్ణోత్సవాల సందర్భంగా గత వారం రోజులుగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు కాకినాడలో బహుమతులు అందజేస్తారు.

### సన్నిహిత వాతావరణ సృష్టికే టాలెంట్ టెస్ట్‌లు..



50 ఏళ్ల క్రితం ఒక చారిత్రక అవసరంగా ఏర్పడిన యూటీఎఫ్ ఉపాధ్యాయల సమస్యలపై పోరాడుతూనే సమాజిక స్పృహతో పని చేస్తుంది. ఉపాధ్యాయులు విద్యా బోధనకే పరిమితమైతే పాఠశాలలు ఉండవని గమనించి 1997లో టాలెంట్ టెస్ట్ నిర్వహణను ప్రారంభించాం. ఇప్పుడు అవి రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మధ్య సన్నిహిత వాతావరణాన్ని కల్పించాయి.

– పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే, టాలెంట్ టెస్ట్‌ల రూపకర్త

### ఇంకా మార్పులు రావాలి



గత 50 ఏళ్లుగా అన్ని రంగాల్లో వచ్చిన విధంగానే విద్యా రంగంలో కూడా అనేక మార్పులు వచ్చాయి. గత ఐదేళ్లుగా ప్రభుత్వ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. అయితే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఎదగాలంటే ఇంకా మార్పులు రావాలి. ఆ దిశగా ప్రభుత్వాలు అడుగులు వేస్తే వారికి సహకరించడానికి యూటీఎఫ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

– సరిపల్లి జయప్రభ, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి

### నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి


కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: విజయవాడలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న శిలా ఫలకాన్ని తొలగించడం, విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి కుట్రపన్నడం హేయమైన చర్యని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి చేసిన నిందితులను తక్షణం అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగిందని ఆయన మండి పడ్డారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన అధికారులు, పోలీసులు అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేస్తుంటే ప్రేక్షక పాత్ర వహించారన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది జనవరి విజయవాడ ముఖ్య కూడలిలో రూ.404.35 కోట్లతో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నిర్మించి జాతికి అంకితం చేశారన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాల జోలికొస్తే ఊరుకొనేది లేదని ఆయన హెచ్చరించారు.

## క్షతగాత్రుడికి ఆర్థిక సాయం


ఆటో డ్రైవర్ ఆకుల సతీష్‌కు ఆర్థిక సహాయం చేస్తున్న న్యూ కలర్స్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు

యలమంచిలి: గ్రామానికి ఆటో డ్రైవర్ ఆకుల సతీష్ కాలేయ సంబంధిత వ్యాధికి గురయ్యాడు. దీంతో అతని కాలుకు ఇన్‌ఫెక్షన్ వచ్చి, పాలకొల్లు, కాకినాడ హాస్పటల్స్‌లో వైద్యానికి రూ.3 లక్షల వరకు ఖర్చు చేశాడు. ప్రస్తుతం కోలుకున్నా, మందులు, ఇతర ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న పాలకొల్లుకు చెందిన న్యూ కలర్స్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు చింతపల్లి మణికంఠ శుక్రవారం సతీష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు సతీష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బొప్పన హరికిషోర్, చిలుకూరి శ్రీనివాస్, కొప్పిశెట్టి శ్రీరామమూర్తి, దొంగ మహేష్, చవ్వాకుల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేశారు.. అవుట్‌లెట్ మరిచారు


వర్షం నీటిలో రైల్వే ప్రయాణికుల ఇక్కట్లు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు రైల్వే స్టేషన్‌ను సుమారు నాలుగేళ్ల క్రితం కొత్త హంగులతో నిర్మాణం చేశారు. స్టేషన్, ప్లాట్‌ఫారమ్‌లు, కాలిబాట వంతెనలు అన్ని హంగులు బాగానే ఏర్పాటు చేసినా ఇంకా లిఫ్ట్ సౌకర్యం మాత్రం కల్పించలేకపోయారు. ఇదిలా ఉంటే స్టేషన్ బయట స్టేషన్ నుంచి భీమవరం రోడ్డు వరకూ సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. కాని స్టేషన్ ఎదురుగా మాత్రం సరైన అవుట్ ఫ్లో పెట్టకపోవడంతో వర్షం నీరు మొత్తం స్టేషన్ ముందే నిలబడిపోతుంది. దీంతో ప్రయాణికులు వర్షం నీటిలో రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు ట్రావెల్ బ్యాగ్‌లు లాక్కుంటూ వస్తున్నారు. కాని ఈ వర్షం నీటిలో బ్యాగ్‌ను రోడ్డుపై లాగితే తడిచిపోతుంది. అలాగని మోయలేని పరిస్థితిలో ఆటోలను స్టేషన్ మెట్టు వరకూ తీసుకురావాలని కోరుతున్నారు. అక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం సరిగా లేకపోవడం వలన ఇలా నీరు నిలిచిపోతుందని ప్రయాణికులు చెబుతున్నారు. బ్యాగ్‌లు మోయలేని పరిస్థితుల్లో వర్షం నీటిలో ఎలా వెళ్లగలమని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు తమ బ్యాగ్‌లను భుజాలపై మోసుకుని వెళుతున్నారు. రైల్వే అధికారులు ఈ సమస్యపై వెంటనే స్పందించి స్టేషన్ ముందు వర్షం నీరు నిల్వ లేకుండా, ప్రయాణికులకు అసౌకర్యంగా కలగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

పాలకొల్లు అర్బన్: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధంసం చేసి విగ్రహం ముందు ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శిలా ఫలకాన్ని తొలగించడంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. విగ్రహం ధ్వంసం చేసిన వారిని తక్షణం అరెస్ట్ చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదేశాల మేరకు శుక్రవారం గాంధీబొమ్మల సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడాలి, అంబేడ్కర్ విగ్రహం ధ్వసం చేసిన వారిని అరెస్ట్ చేయాలి, జై భీమ్, వర్ధిల్లాలి అంబేడ్కర్ ఆలోచన విధానాలంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తోందని విమర్శించారు. ఎంపీటీసీ పెదపాటి వెంకటరత్నం, జేసీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఖండవల్లి వాసు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ఉచ్చుల స్టాలిన్, నాయకులు పెచ్చెట్టి కృష్ణాజీ, కోరాడ శ్రీను, జోగి వెంకటేశ్వరరావు, రామాంజుల పెదమధు, జోగాడ ఉమామహేశ్వరరావు, దొమ్మేటి శ్రీను, శంకరావు శ్రీను, కల్యాణం గంగాధరరావు, అమలాపురపు జ్యోతి బాలాజీ, కట్టా హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

## చింతపర్రును వణికిస్తున్న వైరల్ జ్వరాలు


జ్వరాలపై సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రులో ప్రజలు వైరల్ జ్వరాలతో వణికిపోతున్నారు. గత వారం రోజుల నుంచి గ్రామంలో పలువురు టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతూ పాలకొల్లులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి వైద్యం పొందుతున్నారు. గ్రామ సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు కూడా రెండు రోజులు వైరల్ జ్వరంతో బాధపడి కోలుకున్నారు. శుక్రవారం ఇంటింటా సర్వేలో ఆరుగురు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. గ్రామంలోని మురికివాడల ప్రాంతంలో ఎక్కువగా జ్వరాలు గుర్తైనట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ గుర్తించారు. వీరికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. గ్రామంలోని అన్ని ప్రాంతాల్లోనూ ముగ్గు, బ్లీచింగ్ చల్లించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరి బాబు, ఏఎన్ఎం అనిత, తదితరులు పాల్గొన్నారు.

## విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలి

పెనుగొండ: ఈ నెల 13న శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి పేరేడ్ గ్రౌండ్ వరకూ జరిగే ఎంఆర్‌పీఎస్ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కనపాల పెద్దిరాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆచంట పెదపేటలో నిర్వహించిన ఎంఎస్‌పీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర మంత్రి వర్యులు కిషన్ రెడ్డి, మంద కృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి 13న వస్తున్నారన్నారు. కార్యక్రమంలో చదలవాడ శరత్, జిల్లా అధ్యక్షుడు పలివెల పైడియ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## 17న బార్ అసోసియేషన్ ఎన్నికలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కర్ణి యోహాన్ అన్నారు. శుక్రవారం నామినేషన్లు ప్రారంభించారు. యోహాన్ మాట్లాడుతూ మొదటి రోజు 22 మంది నామినేషన్లు వేశారన్నారు. నామినేషన్ల పరిశీలన అనంతరం పోటీలో నిలిచే అభ్యర్థుల వివరాలను ఈ నెల 12 సాయంత్రం 4.30 గంటలకు వెల్లడిస్తామని తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా డీఎస్‌వీ గోపాల్, న్యాయవాదులు జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, రాపాక కరుణాకరరావు, వీఎస్‌డీ ప్రసాద్, ఆకుల కిషోర్, శ్రీనాథ్, పామర్తి నగేష్ పాల్గొన్నారు.

## రాయితీపై విత్తనాల పంపిణీ

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద, సీతారామపురంలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరదలకు నారుమడులు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా సబ్సిడీపై విత్తనాలను శుక్రవారం అందించారు. ఏడీఏ ఈదా అనిల్ కుమారి, ఎంపీపీ మైలాబత్తుల సోని, రుస్తుంబాద సర్పంచ్ బందెల భారతి మాట్లాడుతూ సాగుకు ఆలస్యం కావడంతో తక్కువ రోజుల్లోనే కోతకు వచ్చే వరి వంగడాలను 80 శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు. పులపర్తి ప్రతాప్, ఆకన చంద్రశేఖర్, కలువకొలను తాతాజీ, వీఏఏలు శ్రీనివాసదొర, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పెనుగొండ: మండల నూతన తహసీల్దారుగా నియమితులైన జి.అనిత కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు అనితకు సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు కలిసి అభినందనలు తెలిపారు.

## విలీన గ్రామాల్లో సమస్యల తిష్ట

- మునిసిపాల్టీ పట్టించుకోదు..
- పంచాయతీకి నిధులు ఉండవు
- రెంటికీ చెడ్డ రేవడిలా విలీన గ్రామాలు


భగ్గేశ్వరం దళితవాడలో సిమెంట్ రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

పాలకొల్లు అర్బన్: రెండింటికీ చెడ్డ రేవడిలా ఉంది విలీన గ్రామాల పరిస్థితి. ఆ గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయి. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. పాలకొల్లు మునిసిపాల్టీలో భగ్గేశ్వరం, పూలపల్లి, ఉల్లంపర్రు, పాలకొల్లు రూరల్, అడవిపాలెం, కొంతేరు గ్రామాలు విలీనమయ్యాయి. అయితే విలీన గ్రామాలకు చెందిన కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో గత ఐదేళ్లుగా ఈ గ్రామాల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. వర్షాకాలం కావడంతో డ్రైనేజీలు పరిశుభ్రం చేయడంలో కూడా పంచాయతీ అధికారులు శ్రద్ధ చూపడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భగ్గేశ్వరం దళితవాడలో కొద్దిపాటి వర్షానికే నీరు రోడ్డు మీద పొర్లుతోంది. వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోయి ప్రజల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. చిన్నారులు పాఠశాలకు వెళ్లాలంటే ఈ మురుగునీటిలో నుంచే వెళుతున్నారు. దీంతో అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి విలీన గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముగ్గు, బ్లీచింగ్ చల్లించాలని ప్రజలు కోరుతున్నారు.

## అందుబాటులో ఆర్టీసీ కార్గో సేవలు

పెనుమంట్ర: గ్రామీణ ప్రాంతాలకు మరింత అందుబాటులో ఉండే విధంగా ఆర్టీసీ కార్గో కొరియర్ సేవలను విస్తరిస్తున్నట్లు నర్సాపురం డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి అన్నారు. శుక్రవారం మార్టేరు సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ కార్గో కొరియర్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో గ్రామీణ ప్రజలకు ప్రయాణ సౌకర్యాలను మరింత అందుబాటులోకి తీసుకురావడంతోపాటు కార్గో కొరియర్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో ఉండే విధంగా విస్తరిస్తామన్నారు. ప్రజలు తమ విలువైన పార్శిల్ కొరియర్ సర్వీసులు సురక్షితంగా గమ్యానికి చేర్చేందుకు ఆర్టీసీ సేవలను తక్కువ ఖర్చుతో సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెనుమంట్ర, పెనుగొండ మానవత సేవా సంస్థల సభ్యులు, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, సభ్యులు కర్రి కృష్ణారెడ్డి, పడాలి జగన్నాథరెడ్డి, చర్ల సూర్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం


ఉచ్చుల స్టాలిన్

యలమంచిలి: విజయవాడ నడిబొడ్డున గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి కూటమి నాయకులు ప్రయత్నించడం హేయకరమైన చర్యని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ జేసీఎస్ బూత్ ఇన్‌చార్జి ఉచ్చుల స్టాలిన్ విమర్శించారు. నిజానికి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్ అక్షరాలను ధ్వంసం చేసినట్లు కనిపిస్తున్నా దాని వెనుక ప్రధాన ధ్యేయం విగ్రహ ధ్వంసమేనని స్టాలిన్ ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరు రాకూడదనే ఉద్దేశ్యంతోనే ఈ ధ్వంసం జరిగిందన్నారు. ఈ ఘోరంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత, మరో మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి నిందితులను పట్టుకొని కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.

## ఓరియంటేషన్ ప్రోగ్రాం

నరసాపురం రూరల్: మానవ సంబంధాలు, విలువలు, సమగ్రంగా తెలుసుకోవడంతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రముఖ విద్యారంగ నిపుణులు డాక్టర్ పి.భవాని, పి.రమేష్ రాజు అన్నారు. శుక్రవారం నరసాపురం మండలం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలోని బీటెక్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల చైర్మన్ కొండవీటి వెంకట సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

నరసాపురం రూరల్: మండలంలోని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఉమ్మడిగా మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీ భద్రరరావు తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. సర్పంచ్‌లకు, సెక్రటరీలకు చెత్త నుంచి సంపద సృష్టి, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం, తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. విధిగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

## వినేశ్ ఫొగాట్‌కు మద్దతుగా నిలవాలి

పెనుగొండ: ప్యారిస్ ఒలింపిక్స్ భారత క్రీడాకారిణి వినేశ్ ఫొగాట్‌కు జరిగిన అన్యాయంపై దేశ ప్రజానీకం యావత్తు ఐక్యంగా పోరాడి, వినేశ్‌కు మద్దతుగా నిలవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ శర్మ, జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి చంటిబాబు పిలుపునిచ్చారు. ప్యారిస్‌లో 100 గ్రాముల అధిక బరువు నెపంతో ఏక పక్షంగా అనర్హురాలిగా ప్రకటించడం తీవ్రంగా ఖండించాలన్నారు. ఫొగాట్‌కు పతకాలు పొందిన క్రీడాకారులకు ఇచ్చే నగదు పురస్కారాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ హోదాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుమ్మడి తేజ మనస్వి, ఆర్ఎంసీ కుమార్, అరిగెల సురేష్, వాలీబాల్ క్రీడాకారులు పల్లపు రాజు, దుర్గా ప్రసాద్, సీహెచ్ స్వరూప్, కె.శాంసన్, ఎస్.జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

## రేపు మెగా వైద్య శిబిరం

యలమంచిలి: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దొడ్డిపట్ల హైస్కూల్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, కిడ్నీ, మూత్ర, చర్మ, దంత, నేత్ర, జనరల్ వ్యాధులకు డాక్టర్ యాతం లక్ష్మీ శ్రీ రంగ, డాక్టర్ జక్కంపూడి సూభాషిణి, డాక్టర్ కుసుమ ప్రశాంతి, డాక్టర్ కావలి మౌనితోపాటు అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు చేస్తారని క్లబ్ అధ్యక్షుడు జక్కంపూడి మదన్‌మోహన్ తెలిపారు.